



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

ఆదివారం 14 సెప్టెంబర్ 2025 పేజీలు 8


# అత్యున్నత ప్రమాణాలతో...

## దసరా ఉత్సవాల ఏర్పాట్లు ఉండాలి

- భక్తులకు ఏమాత్రం అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయండి
- ఏర్పాట్లలో నిర్లక్ష్యం కనిపిస్తే ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత
- ఆకస్మిక తనిఖీల్లో అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ
- నాలుగు గంటల పాటు ఇంద్రకీలాద్రిపై అణువణువూ పరిశీలించిన కలెక్టర్



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** దసరా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని.. భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా, ఏర్పాట్లలో అలసత్వం కనిపించినా ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత అని, నిరంతర పర్యవేక్షణతో ఏర్పాట్లను పూర్తిచేసి ఉత్సవాలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కనకదుర్గమ్మ దేవస్థాన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఉదయం జిల్లా కలెక్టర్.. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన తనిఖీలు దాదాపు నాలుగు గంటల పాటు కొనసాగాయి. ఇంద్రకీలాద్రి, పరిసర ప్రాంతాల్లో ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అణువణువూ పరిశీలించి కార్యనిర్వహణ అధికారి, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, తాగునీటి సరఫరా, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు తదితరాలను పరిశీలించారు. తొలుత ఘాట్ రోడ్డు నుంచి మిగతా 2లో



- కరువైన ఆహార పౌష్టికత
- నిలిచిపోయిన రేషన్ కందిపప్పు
- బహిరంగ మార్కెట్లో అధికధరలు
- విలవిల్లాడుతున్న నిరుపేదలు

## పేదింట ఉడకని కందిపప్పు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** జిల్లాలోని రేషన్ కార్డుదారులకు కందిపప్పు అందని ద్రాక్షైంది. పండుగలకు సైతం పేదింట పప్పు ఉడకక పౌష్టికత కరువైంది. తక్కువ ధరకే చౌక ధరల దుకాణాల్లో కందిపప్పు అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలకు రెక్కలొచ్చాయి. మార్కెట్లో కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. ధరల పరుగుపై పాలకుల్లో కాస్తంతైనా చలనం లేదు. కృష్ణా జిల్లాలో 1059 రేషన్ డిపోల్లో 5లక్షల 20వేల 479 తెల్ల రేషన్ కార్డుదారులు, 14లక్షల 47వేల 563 మంది లబ్దిదారులున్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా తెల్లరేషన్ కారుల్డపై బియ్యం ఉచితంగాను, అర కిలో పంచదార రూ.17, కిలో కందిపప్పు రూ.70 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే.

కందిపప్పు విషయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా కొంత శాతం కోత పెడుతూ వచ్చింది. ఫిబ్రవరి 2025 నుండి పూర్తిగా కార్డుదారులకు కంది పప్పు పంపిణీని నిలిపివేసింది. మిగతా 2లో...

మొట్ట మొదటిసారిగా..

## స్వచ్ఛత విభాగంలో రాష్ట్రానికి అవార్డ్

- జాతీయ స్థాయిలో ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డ్స్ తరహాలో రాష్ట్రానికి "స్వచ్ఛఆంధ్ర అవార్డ్స్" పేరుతో అవార్డ్స్
- మొదటి విడతగా 16 విభాగాలకు గాను 52 అవార్డ్స్ ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మ రెడ్డి పట్టాభిరామ్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేనివిధంగా మొట్ట మొదటిసారిగా స్వచ్ఛత విషయంలో రాష్ట్రానికి అవార్డ్స్ ఇస్తున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు.రాష్ట్రంలో 16 విభాగాలకు గాను అవార్డ్స్ ఫైనల్ చేసే మిగతా 2లో...

2026 అక్టోబర్ కల్లా..

## మచిలీపట్నం పోర్టు సిద్ధం

ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబర్ లో పోర్టు రవాణ కార్యకలాపాలు ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణ రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి 2

# అత్యున్నత ప్రమాణాలతో దసరా ఉత్సవాల ఏర్పాట్లు ఉండాలి





ఆధ్యాత్మిక వాతావరణంలో, భక్తిభావం ఉప్పొంగేలా..

(మొదటిపేజీ తరువాయి)

ఇంద్రకీలాద్రి రాజగోపురం వరకు ఏర్పాటు చేసిన క్యూ లైన్లను పరిశీలించి సూచనలు చేశారు. క్యూలైన్లపై వేసిన షేడ్స్ పైకి ఉండేలా చూసి.. వాటిని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు అవసరమైన స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేయడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన సిబ్బందిని నియమించుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కట్లు తదితరాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యం వెల్లివిరిసేలా.. భక్తిభావం ఉప్పొంగేలా దసరా ఉత్సవాల ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని.. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. భక్తుల ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు ప్రణాళిక ప్రకారం సరైన విధంగా ఉండేలా.. ఆధ్యాత్మిక శోభతో అలంకరణ ఉండేలా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆలయ కార్యనిర్వహణ అధికారి శీనా నాయక్, పోలీస్ అధికారులు రామకృష్ణ, దుర్గారావు, ఆలయ ఇంజనీర్లు కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, రాంబాబు, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# 2026 అక్టోబర్ కల్లా మచిలీపట్నం పోర్టు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)



మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్, బెర్తులు, రహదారులు, పరిపాలన భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలు తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయన ఇప్పటి వరకు ఆయా పనుల పురోగతి ఎంత వరకు పూర్తయ్యాయనే దానిపై సమీక్షించారు. పెద్ద మొత్తంలో యంత్రాలు, మ్యాన్ పవర్ పెంచి నిర్దేశించిన సమయానికి పోర్టు పనులను పూర్తిచేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.5,500 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబర్ కల్లా పోర్టు రవాణా కార్యకలాపాలను ప్రారంభించాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని పేర్కొన్నారు. మచిలీపట్నం పోర్టు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలను తీర్చడంతో పాటు సమీపంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర అవసరాలు కూడా తీరుతాయని అన్నారు. ప్రణాళికలో భాగంగా మొత్తం 16 బెర్తులను ఏర్పాటు చేస్తున్నామని, మొదటి దశగా నాలుగు బెర్తులను అనుకున్న సమయానికి పూర్తి చేసి కార్యకలాపాలను ప్రారంభిస్తామని, మిగిలిన బెర్తుల నిర్మాణ పనులను కొనసాగిస్తామని, ప్రస్తుతానికి 50 శాతం మేర పనులు పూర్తయినట్లు ఆయన తెలిపారు. త్వరలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు కానున్న నేపథ్యంలో హైదరాబాదు మార్గంతో పాటు పోర్టుకు సమీపంలోని జాతీయ రహదారులు, రైలు రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామని, అందుకు సంబంధించిన డిపిఆర్ లను(డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గిలకలదిండిలోని ఫిషింగ్ హార్బర్ పనులు కొంతమేర నెమ్మదించాయని, వాటిని కూడా వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ పర్యటనలో మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, జాయింట్ సి ఎఫ్ ఓ సతీష్, ఏపీ మారిటైమ్ బోర్డు సిఈ రాఘవరావు, రైట్స్ టీం లీడర్ విశ్వనాథం, ఇన్చార్జి డిఆర్ఓ, కేఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరులు, మచిలీపట్నం నార్త్ మండలం తహసిల్దార్ నాగభూషణం తదితర అధికారులు పాల్గొన్నారు.

# మొట్ట మొదటిసారిగా స్వచ్ఛత విభాగంలో రాష్ట్రానికి అవార్డ్స్

(మొదటిపేజీ తరువాయి)




విషయానికి సంబంధించి థర్డ్ పార్టీ సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వ భాగస్వామ్యంతో జియో స్టాట్ సంస్థ విజయవాడలో నిర్వహిస్తున్న "ట్రైనింగ్ ఆఫ్ అస్సెస్సర్స్" పేరుతో అసెస్మెంట్ టీం కి ఇస్తున్న ట్రైనింగ్ సెషన్ కి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హాజరయ్యారు..ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ జియో స్టాట్ సంస్థ ఇతర రాష్ట్రాల్లో కూడా స్వచ్ఛతకి సంబంధించి సర్వే నిర్వహించిందని తెలిపారు. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో మాత్రమే స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో అవార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని ఈ మధ్యనే అందులో మన రాష్ట్రం ఐదు అవార్డ్స్ సాధించడం జరిగిందని రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డ్స్ తీసుకోవడం జరిగిందని పట్టాభిరామ్ తెలిపారు. అదే తరహాలో రాష్ట్రం లో కూడా స్వచ్ఛత, శానిటేషన్ విషయంలో పోటీ తత్వం పెరిగే విధంగా రాష్ట్రం లో కూడా ఈ అవార్డ్స్ ప్రవేశపెట్టడం జరిగిందని ఈ అవార్డ్స్ సాధించిన వారికి ఫైనాన్సియల్ ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని పట్టాభిరామ్ తెలిపారు..స్వచ్ఛత అవార్డ్స్ కి సంబంధించి మొత్తం 90 విభాగాలకు నోడల్ ఆఫీసర్స్ తో వెరిఫికేషన్ జరిగిందని అందులో మొదటి విడతగా 16 విభాగాలకు 52 అవార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని పట్టాభిరామ్ తెలిపారు.ఈ ట్రైనింగ్ తీసుకున్న టీం అంత 26 జిల్లాలకు వెళ్లి 16 విభాగాలని సర్వే చేసి ఇచ్చిన ఫైనల్ రిపోర్ట్ ద్వారా అవార్డ్స్ ఇవ్వడం జరుగుతుందని పట్టాభిరామ్ తెలిపారు. ఇప్పటికే గత ప్రభుత్వం వదిలివెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తని 90 శాతం వరకు క్లియర్ చేయడం జరిగిందని,ఇక నుంచి ఈరోజు చెత్తని ఆరోజు ప్రాసెస్ చేసే విధంగా వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ లు ఏర్పాటు చేస్తున్నామని వాటితో పాటు వేస్ట్ నుంచి పవర్ జనరేట్ అయ్యే విధంగా వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నామని పట్టాభిరామ్ తెలిపారు..దేశం లో ఎక్కడ లేని విధంగా రీసైక్లింగ్ విధానానికి సరికొత్త చుట్టేలా సర్క్యులర్ ఎకానమీ ని తీసుకొస్తున్నామని,రీసైక్లింగ్ పార్క్ ని కూడా ఏర్పాటు చేస్తున్నామని పట్టాభిరామ్ స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గత పది నెలలుగా ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర డే గా ప్రకటించి ఒక రోజంతా పనిచేస్తున్నారని చంద్రబాబు ఆశయ సాధన ఫలించాలంటే కచ్చితంగా స్వచ్ఛత విషయం లో మెరుగైన మార్పులు రావాలని ఈ విషయం లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ కూడా ఎంతో పట్టుదలతో ఉన్నారని పట్టాభిరామ్ తెలిపారు..అందుకు ఈ అవార్డ్స్ ఎంతో ఉపయోగపడతాయని తద్వారా ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున మార్పు కూడా కనిపిస్తుందని పట్టాభిరామ్ తెలిపారు...ఈ కార్యక్రమం లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ తో పాటు "జియో స్టాట్" ఎండీ వివేక్ రెడ్డి,స్వచ్ఛ ఆంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## పేదింట ఉడకని కందిపప్పు

కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేదలు, నిరుపేదలు నెలలో ఒక్క పూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో రకాన్ని బట్టి రూ.170 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు ప్రత్యేకమైన సరుకులు అందించేవారు. ఈసారి నెలవారి ఇచ్చే సరుకుల్లో కందిపప్పుకు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డుదారులు విలవిల్లాడుతున్నారు. ఇలా చౌక ధరల దుకాణాల్లో కందిపప్పు సరఫరాకు ఎగనామం పెట్టడంతో పేదలకు ఆర్థికంగా భారమైంది. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే స్పందించి కందిపప్పును పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. మరి దసరా పండుగ నాటికైనా రేషన్ డిపోల్లో కందిపప్పు అందిస్తారని ఆశిద్దాం.

## నేడే బాలికల సంరక్షణ అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జువైనల్ జస్టిస్ కమిటీ, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి సదస్సును ఈ నెల 14వ తేది ఆదివారం ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 3.00 గం.ల వరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించడం జరుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జువైనల్ జస్టిస్ కమిటి నోడల్ అధికారి వి.యస్.యస్.శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రత్యేక అతిథిగా ముంబై హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితి ధరె పాల్గొంటారని,వీరితో పాటు ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్ జువైనల్ జస్టిస్ కమిటీ చైర్ పరసన్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ, సభ్యులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ డా? జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ చల్లా గుణరంజన్ పాల్గొంటారని తెలిపారు.భారతదేశ సుప్రీం కోర్టు వారి సూచనల మేరకు ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా ఇటువంటి సదస్సులు విభిన్న అంశాలపై నిర్వహించటం జరుగుతుందని. ఈ ఏడాది సుప్రీంకోర్టు వారి సూచనల మేరకు బాలికల సంరక్షణ అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని యూనిసెఫ్, స్త్రీ శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విద్య, ఆరోగ్య, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.ఈ సదస్సుకు అన్ని జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు, పిల్లల సంరక్షణ న్యాయస్థానాల న్యాయమూర్తులు, పోక్సో కోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు.సదస్సులో బాలికల సంరక్షణకు సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టపరమైన హక్కులు, రక్షణ, ప్రభుత్వ పథకాలు ఇతర అంశాలు, వాటిని అమలుపరచడంలో వస్తున్న ఇబ్బందులు వాటిని ఏ విధంగా అధిగమించాలి అనే విషయాలు చర్చించి పరిష్కారమార్గాలు సూచిస్తారని, బాలికలపై జరుగుతున్న నేరాలు ఏ విధంగా అరికట్టాలి అనే అంశాలపై కూడా చర్చించి తగిన సూచనలు చేస్తారని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జువైనల్ జస్టిస్ కమిటీ నోడల్ అధికారి వి.యస్.యస్.శ్రీనివాస్ శర్మ ఆ ప్రకటనలో తెలిపారు.

## కొత్త రాజరాజేశ్వరి పేటలోని డయేరియా కేసులను సమీక్షించిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్:** నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శనివారం సాయంత్రం కొత్త రాజరాజేశ్వరి పేటలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నీటి సరఫరా, నమోదైన డయేరియా కేసులు వాళ్ళ స్థితిగతులను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డి ఎం ఓ హెచ్ సుహాసిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకమైన చర్యలు విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటుందని, కేవలం రాజరాజేశ్వరి పేట లోనే కాకుండా నగరం మొత్తంలో అవగాహన కల్పించి ప్రజలకు ఏటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ శైలజా రెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించిన ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు శనివారం మధ్యాహ్నం గిలకలదిండిలో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రణాళికకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి డ్రెడ్జింగ్, బ్రేక్ వాటర్, భవన నిర్మాణాలు, టెట్రాపాడ్స్ దిమ్మల ఏర్పాటు తదితర పనుల పురోగతి వివరాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆశించిన రీతిలో పనులు ముందుకు సాగడం లేదని, దీనితో పురోగతి మందగించిందని పేర్కొంటూ, పనులను వేగవంతం చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ నెలాఖరికి పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ టీం లీడర్ చేతన్, ఏపీ మారిటైం బోర్డు సీఈ రాఘవరావు, ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరులు, మచిలీపట్నం దక్షిణ మండల తహసిల్దార్ మధుసూదన్ రావు తదితరులు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వెంట ఉన్నారు.

## మట్టి ఖర్చులకి పదివేల రూపాయలు వితరణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జొన్నల వారి పాలెం కాపురస్తులైన దింటకుర్తి వీరబాబు అకాల మరణం వల్ల వారి కుటుంబానికి కానూరు శ్రీ వెంకటేశ్వర పిఎసిఎస్ తరపున కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు ప్రతాప్ నరేష్ కుమార్ ల చేతుల మీదగా మట్టి ఖర్చుల నిమిత్తం వితరణ కార్యక్రమం నిర్వహించారు దింటకుర్తి వీరబాబు కుమారుడు దింటకుర్తి జోజిబాబు కి మట్టి ఖర్చుల నిమిత్తం 10000 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రెటరీ అడపా శ్రీనివాస రావు, జొన్నలగడ్డ బాబూరావు, గోపు వెంకట రమణ, దింటకుర్తి బాలాజీ, జొన్నల జోజి, రామకృష్ణ, కె.శ్రీనివాస రావు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అందించడం జరిగింది.

## వాకర్స్ భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఉదయపు నడక మిత్రమండలి, విజయవాడ ఒమేగా అనూ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డా. మౌనిక, డా.శ్వేత, డా.దీప్తి బిపి, షుగర్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. శ్రీ ఐ కేర్ ఆఫ్టోమెట్రిస్ట్ అజయ్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయపు నడక మిత్రమండలి అధ్యక్షుడు జల్లు మురళినాథ్, కార్యదర్శి ఘంటశాల రాము, వేద నరసింహం, జోన్ చైర్పర్సన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, పూర్వ డిప్యూటీ గవర్నర్ వై జగన్మోహన రావు, లంకెశెట్టి తాండవ కృష్ణ, విన్నకోట సంధ్య, కే కుమారి పర్యవేక్షించారు.

# పది మంది గురువులకు ఘన సత్కారం



**గన్నవరం, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** గురు పూజోత్సవం సందర్భంగా గన్నవరం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పది మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విశ్వభారతి నవోదయ, సైనిక్ కోచింగ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కొల్లి సత్య జగదీశ్వరరావు (గొల్లనపల్లి హైస్కూల్ హెచ్ఎం), జి.వి. రవిబాబు (గన్నవరం బాలుర హైస్కూల్), డి. రాజరాజేశ్వరి (వేలేరు హైస్కూల్), డి. రాజారత్నం (సీతారామపురం ఎంపీపీఎస్), డి. కుమార్ (దావాజిగూడెం హైస్కూల్), డి. జ్వానేష్ (వెదురుపావులూరు ఎంపీపీఎస్), కేవీ పద్మావతి (చింతలపేట ఎంపీపీఎస్, గన్నవరం), ఆర్. రత్నకుమారి (దావాజిగూడెం ఎంపీపీఎస్), టి. సుబ్బలక్ష్మీ (గన్నవరం బాలికల హైస్కూల్), సి. రాధ (వీరపనేనిగూడెం హైస్కూల్) లకు శాలువాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన గురుకులాల నుండి నేటి ఆధునిక విద్యా వ్యవస్థ వరకు గురువులు సమాజానికి వెలుగునిచ్చే మార్గదర్శకులు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, విద్యా విభాగ డైరెక్టర్ సయ్యద్ లాల్, ఆర్థిక విశ్లేషకులు జీ. వెంకట్రావు, లక్నో ఎయిర్పోర్ట్ మాజీ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇంచార్జి ప్రిన్సిపాల్ వి.వి. కృష్ణమోహన్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పువ్వుల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలో మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యులు, డైరెక్టర్లు, సైనిక్, నవోదయ విద్యాలయాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## గాయత్రి మందిరం కమిటీ అధ్యక్షులుగా కె.వి.ఆర్ కిషోర్



**గన్నవరం, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** గన్నవరం గాయత్రి మందిరం నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ కె.వి.ఆర్ కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాదెళ్ల మోహన్, విష్ణుమూర్తి, కడియాల రవి, కంభంపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. కార్యదర్శిగా ఎస్.వి గోపాలకృష్ణ, కోశాధికారిగా జీవి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా ఎస్. రవికుమార్, కే. శివ రామకృష్ణ, సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్ శర్మ, సిహెచ్ బిబి శర్మ, న్యాయ సలహాదారుగా జి ఎస్ ఆర్ మూర్తి, గౌరవ సలహాదారులుగా ఎస్. వెంకటేశ్వర శర్మ, జి గోపాలకృష్ణ శర్మ, పిఆర్వోలుగా కే. శ్రీవత్స, వి.వి కృష్ణమోహన్, సభ్యులుగా రాధా కుమారి, శ్రీపాద, మరో 9 మందితో కమిటీ ఏర్పడింది. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన బాలకృష్ణ మూర్తి కాలం చేయడంతో కొద్ది నెలలుగా నిర్వహణ కార్యక్రమాలు ఆగాయి. నూతన కమిటీ మందిర నిర్వహణ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని కిషోర్ తెలిపారు. అందరి సహకారంతో గాయత్రీ మందిర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు అనే లక్ష్యంతో ముందుకు సాగుతామన్నారు. అధ్యక్షులుగా నియమితులైన కిషోర్ కు గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, యువకులు అభినందనలు తెలిపారు.

### శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన అధికారుల తీరుపై

# మండిపడుతున్న సామాన్య భక్తులు..



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 13,మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నూతన ఆలయం నిర్మాణం జరిగిన రోజు నుంచి ప్రతినిత్యం ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రాన్ని భక్తులకు పంపిస్తూ ఉండేవారు, దానిని కొంతమంది పాత్రికేయులు వివిధ మాధ్యమాలలో పంపిణీ చేయడం వలన అనేకమంది అమ్మవారి భక్తుల నిత్యం అమ్మవారిని దర్శించుకునేవారు. అయితే కొంతకాలంగా నూతనంగా విజయవాడ నుంచి వచ్చిన కొందరు అధికారులు అమ్మవారి ఫోటోలు మీడియా వారు సైతం ఎవరు అమ్మవారి గర్భ గుడిలో ఫోటో తీయవద్దని ఆజ్ఞలు జారీ చేశారు. ఈ అధికారులు ఇద్దరు గతంలో ఇక్కడ పనిచేసినప్పుడు అనేక ఆరోపణలతో ఇక్కడ నుండి ట్రాన్స్ఫర్ అయ్యారు మరలా ఇదే దేవాలయానికి వచ్చి గత వైభవాన్ని మరలా సృష్టిస్తున్నారు అనేది గుసగుసలు.అయితే దీనిలో కొందరు అర్చకులు మాత్రం పెద్ద నాయకులుగా చెప్పుకునే కొందరికి ప్రతినిత్యం అమ్మవారి చిత్రపటాన్ని పంపిస్తూ, వారి మెప్పు పొందుతున్నారు.సామాన్యులకు మాత్రం అందుబాటులో లేకుండా చేస్తున్నారు. అమ్మవారికి గత 15 సంవత్సరాల నుంచి లక్షల మంది భక్తులు అమ్మవారి చిత్రపటాన్ని ప్రైవేట్ మాధ్యమాల ద్వారా సేకరించుకొని తమ చరవాణిలో భద్రపరచుకొని ఆరాధన భావంతోటి ముందుకు సాగుతూ ఉన్నారు, కానీ కొందరు అధికారుల తీరు వల్ల పెద్దలకు మాత్రమే అమ్మవారి చిత్ర పటంవెళ్తుంది,దీనిపై అధికారులను వివరణ కోరగా కనీసం వారు స్పందించకపోవడం వారి అహంకారాన్ని తెలియజే స్తుంది. ఇప్పటికైనా అధికారులు పెద్దలకే న్యాయం చేయకుండా, సామాన్య భక్తులకు కూడా సమన్యాయం పాటించేలాగా,రాష్ట్ర ఉన్నతాధికారులు సామాన్య భక్తులకు సైతం న్యాయం జరిగేలాగా చర్యలు తీసుకోవాలని సామాన్యులు,భక్తులు కోరుకుంటున్నారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని వరలక్ష్మికి సత్కారం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక మోడల్ ప్రైమరీ స్కూల్ గుడ్లవల్లేరు-2 ఉపాధ్యాయిని ఏవి వరలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరఫున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని వరలక్ష్మిని దుశ్శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ మా పాఠశాల ఉపాధ్యాయురాలు జిల్లా ఉత్తమఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ముదావహమంటూ, ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలోటీచర్స్లో నాగలక్ష్మి, లక్ష్మీ కుమారి, సి ఆర్ పి ఉమారాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కళాపరిషత్‌కు కుర్చీలు, ఫ్యాన్లు వితరణ



**చల్లపల్లి మేజర్ న్యూస్:** చల్లపల్లి గ్రామ పంచాయతీ (ఎన్టీఆర్ పార్కు)పార్కులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌కు చల్లపల్లి షణ్ముఖ జనరల్ స్టోర్స్ అధినేత వేముల పాండురంగారావు 20 కుర్చీలను, రెండు సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందచేశారు. పాండురంగారావు.. దీపికల పెద్ద కుమారుడు వేముల నవీన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు, కార్యదర్శి ముమ్మనేని సన్నీ, సహాయ కార్యదర్శి ఉప్పల సాంబశివరావులు ఉన్నారు.

# శ్రీకొండలమ్మ దేవస్థానం చైర్మన్‌గా ఈడే మోహన్ నియామకం






## సామాన్యుడిని కొండలమ్మ దేవస్థాన చైర్మన్ చేసిన ఎంఎల్‌ఏ వెనిగండ్ల

## పాలకవర్గాన్ని నియమిస్తూ వెలువడిన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

## ఈనెల 17 న ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

**గుడ్లవల్లేరు సెప్టెంబరు 13 మేజర్ న్యూస్ :** కార్యకర్తే పార్టీకి జీవగర్ర అనే రాజకీయ నాయకుల మాటలు నీటి మూటలుగా మైకుల్లో ప్రసంగాలకే పరిమితమయ్యేవి. కాని నేటి రాజకీయాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలకు విభిన్నంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాత్రం తన సత్తాను చాటారు. తనను నమ్మి తన గెలుపు కోసం తన వెంట ఎన్నికల్లో తిరిగిన ఒక కుగ్రామానికి చెందిన ఒక సామాన్య కార్యకర్తను రూ. 2కోట్ల వార్షిక ఆదాయం వచ్చే ప్రఖ్యాతిగాంచిన శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయానికి చైర్మన్‌ను చేశారు. ఈ చైర్మన్ పదవిని ఎమ్మెల్యే రాము పట్టుబట్టి గుడ్లవల్లేరు మండలం కట్టవానిచెరువు శివారు చింతలగుంటకు చెందిన ఈడె వెంకట విష్ణు మోహనరావు (మోహన్)కు పట్టం గట్టారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నేటి వరకు ఎమ్మెల్యే అడుగుజాడల్లోనే నడుస్తూ, ఆయన చెప్పిన మాటే పరమావధిగా అడుగులు ముందుకు వేస్తున్న మోహన్‌కు కొండలమ్మ ఆలయ చైర్మన్ పదవి వరించింది. గత నెల ఈ ఆలయ కమిటీకి నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేయటంతో ఈ ఆలయ చైర్మన్‌పై టీడీపీలో చర్చలు తారాస్థాయికి చేరాయి. కాని ఎట్టకేలకు ఎమ్మెల్యే వెనిగండ్ల గెలుపుకు ఎన్నికల్లో అత్యంత కృషి చేసిన మోహన్‌కే చైర్మన్ ఇచ్చారన్న వాదనలు మిన్నంటాయి. అదే మోహన్ సామాజిక వర్గానికి చెందిన నలుగురైదుగురు టీడీపీ నేతల పేర్లు గతంలో వినబడినా నూతన పాలకవర్గం పేర్లు రాగానే ఆ ప్రచారానికి తెర పడింది. అలాగే గుడ్లవల్లేరు మండలంలోని టీడీపీ నాయకుల్లో అందరి మద్ధతు పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ మోహన్‌కే ఉండడం ఈ పదవికి బలం చేకూర్చటంతో చైర్మన్‌ను ఇచ్చేందుకు ఎమ్మెల్యే వెనిగండ్లకు సుగమం అయ్యింది. నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ సంబంధిత జీవో శనివారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 17వ తేదీన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జరుగనుంది.

### నియామకమైన శ్రీ కొండలమ్మ దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి



గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి దేవదాయ ధర్మదాయ కమీషనర్ గొల్లపూడి వారి ఉత్తర్వుల ప్రకారం నూతన ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులు శనివారం జారీ అయ్యాయి. చైర్మన్‌గా ఈడె వెంకట విష్ణు మోహన్‌రావు(మోహన్), ధర్మకర్తలుగా తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంనేయులు, కళ్లేపల్లి సుగుణశేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దిబోయిన శ్యామలాదేవి, నూతులపాటి లక్ష్మీ పావనిని నియమించినట్లుగా ఆదేశాలు వచ్చాయి.

# కొల్లి బాబీని అరెస్టుచేసి, దోషులను కఠినంగా శిక్షించాలి





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కైకలూరు నియోజకవర్గం, దానా గూడెంలో దళిత యువకులపై కత్తులతో అగ్రవర్ణాల దాడి ఘటనను గుడ్లవల్లేరు మండల దళిత సంఘాలు శనివారం నిరసించాయి. ఈ సందర్భంగా దళిత నాయకుల ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, గజమాల వేసారు. అనంతరం దళిత యువ నాయకులు దాసి సత్యనారాయణ, మాలమహానాడు నాయకులు కోటే రామ్ నాథ్, సీనియర్ దళిత నాయకులు వారా పాపారావు లు మాట్లాడుతూ దానాగూడెం యువకులపై కత్తులతో దారుణంగా దాడిచేసి గాయపరచిన ఘటనకు కారకులైన 9 మందిలో యిప్పటికే అరెస్టు చేసిన 8 మందిని, ప్రధాన కారకుడైన జనసేన నేత కొల్లి బాబీని తక్షణమే అరెస్టు చేయాలని, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. కొల్లి బాబీని అరెస్టు చేయని పక్షంలో దళితులంతా సంఘటితమై భారీగా ఉద్యమిస్తామని పేర్కొంటూ, దోషులకు కొమ్ముకాసే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. అదేవిధంగా యిలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దళితులంతా సంఘటితమై రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. అనంతరం దళిత నాయకులు కైకలూరు దానాగూడెం వెళ్ళి బాధితులను పరామర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దళిత నేతలు జక్కుల నెలబాలుడు, పులి ప్రశాంత్, ఈదా కొండయ్య, పెనుమాల రంగారావు, కంభం బ్రహ్మాజీ, దాసరి రవి, దారా సత్యనారాయణ, శివాజీ, బ్రహ్మం, పెంజంద్ర సర్పంచ్ రేమల్లి తాతబ్బాయి, పులి ప్రభుదాసు, నాగరాజు, దారం సామ్యేలు, సురేష్(పండు) మండలంలోని వివిధ గ్రామాల నుండి దళిత యువత పెద్ద ఎత్తున పాల్గొని జైభీమ్, దళితుల ఐక్యత వర్ధిల్లాలి, దోషులను శిక్షించాలి అంటూ నినదించారు.

# నరేష్‌కు కూటమి పార్టీలు అండగా ఉంటాయి : ఎమ్మెల్యే కుమార్ రాజా

**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ స్వీట్ షాప్ ప్రమాదవశాత్తు అగ్గిప్రమాదం దగ్ధం కాగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి నరేష్ ను పరామర్శించారు. శనివారం నరేష్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే, నాయకులు ఆయనను పరామర్శించి తెలుగుదేశం, జనసేన పార్టీలు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా నరేష్ కుటుంబం పామర్రు సెంటర్లో స్వీట్ షాపును నడుపుతోందని, ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు 30 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ఈ సందర్భంగా కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ విషయాన్ని జనసేన పార్టీ అధిష్టానం దృష్టికి కూడా తీసుకు వెళ్ళామని, నరేష్ కుటుంబానికి ప్రధాన ఆదాయంగా ఉన్న స్వీట్స్ షాపు అగ్నికి ఆహుతి కావడంతో ఆర్ధికంగా ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆయనకు అన్ని రకాలుగా అండగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజా తో పాటు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, పామర్రు, తోట్లవల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వీరపనేని శివరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఘంటా సురేష్, చాట్ల రమేష్, మండపాక శంకర్ బాబు, దగ్గుపాటి ఫణి, వీరంకివెంకటేశ్వరరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





## వెంకటేశ్వరుని భక్తులకు అన్నసమారాధన

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైం ది. శనివారం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తు లకు భారీ అన్నసమారా ధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్ధికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. 8వేల మంది భక్తులు అన్నప్రసాదాల్ని స్వీకరించారన్నారు. స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాల్ని భక్తులు స్వీకరించారు. స్వామివారి పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేషనల్ హైవేకీ కనపడని మెయింటెనెన్స్.

### ఆ మొక్కలపై కోతులు చెలగాటం ప్రయాణికులకు ప్రాణ సంకటం



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 13,మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు, షేర్ మామది పేట అడ్డరోడ్డునేషనల్ హైవే 65 గట్టు భీమవరం వద్ద గల టోల్ గేట్ వాహనాల వద్ద టోల్ వసూలు చేయడమే తప్ప,రహదారి మెయింటెనెస్ చేయడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.సర్వీస్ రోడ్లు పాడైన పట్టించుకోవడం లేదని,ఫ్లైఓవర్ బ్రీడ్జీ గోడలకి సైతం చెట్లు పెరిగిన పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.టోల్ గేట్ రుసుము వాహనాల నుండి వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సర్వీస్ రోడ్లను బాగు చేయడం లేదని,రోడ్ల వెంబడి చెట్లను మెయింటెయిన్ చేయడం టోల్ యాజమాన్యం పూర్తిగా ఫెయిల్ అయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అటువంటప్పుడు టోల్ గేట్ రుసుము ఎందుకు చెల్లించాలని,టోల్ గేట్ ని తీసి వేయాలని ప్రజల నుండి పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ టోల్గేట్ వాళ్లల్లో మార్పు రాకపోతే ప్రజలు తిరగబడేలా ఉన్నారు ఇది గ్రహించి ఎప్పటికప్పుడు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రయాణికులకు అందజేయాల్సినటువంటి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కరాటే భాగంలో విజేతలకు అభినందనలు



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** పటమట బాయ్స్ హై స్కూల్,విజయవాడ లో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఉమ్మడి కృష్ణ డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్. నిర్వహించిన కరాటే పోటీలలో జగ్గయ్యపేట మండలంలోని రాంకో స్కూల్, జె డి ఏ వి స్కూల్, లిటిల్ ఏంజెల్ స్కూల్ విద్యార్థులు పాల్గొనగ అండర్ - 14 ఏజ్, కాటగిరిలో 27కిలోల విభాగం లొ యం. కావ్య శ్రీ మొదటి స్థానం, గాయత్రి షా రెండవ స్థానం, 33కిలోల విభాగం లొ యం. నవ్య శ్రీ మొదటి స్థానం, జి. సంజనా దేవి శ్రీ రెండవ స్థానం, 45కిలోల విభాగం లొ సి హేచ్. మీనాక్షి రెండవ స్థానం లొ గెలుచుకోని రాష్ట్ర స్థాయికి ఎంపికైన్నారు అని యం. యం. నాయక్ కరాటే కోచ్, యం. ఏ. మంగ లేడీ ఇంస్ట్రాక్టర్ తెలియజేయగ జె. డి. ఏ. వి ప్రిన్సిపాల్ రమాదేవి మేడం, లిటిల్ ఏంజెల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ వి ఎస్ ఎస్. శ్రీనివాస్, రాంకో స్కూల్ ప్రిన్సిపాల్. జిఎస్ నారాయణి విద్యార్థులను అభినందించారు.

## పిఏసిఎస్ చైర్మన్‌గా అమరబాబును నియమించండి...

### ఎమ్మెల్యేకు నాయకుల వినతి



పెదపారుపూడి మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పెదపారుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా పాలడుగు అమర్ బాబును నియమించాలంటూ సంఘం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే కుమార్ రాజాను కోరారు. సహకార సంఘం పరిధిలో గల పెదపారుపూడి, ఈదులమద్దాలి, భూషణగుళ్ళ, గురువిందగుంట, మహేశ్వరపురం గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు శనివారం పామర్రు లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ పార్టీ నాయకులతో చర్చించి అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. పెదపారుపూడి టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగన్నబోయిన గాంధీ, నాయకులు చెరుకూరి మల్లికార్జున రావు, పునుకొల్లు బెనర్జీ, చాపరాల సాంబశివరావు, పునుకొల్లు భాను, శ్రీను, రాజబాబు, కలపాల కిషోర్, గడ్డి శ్రీను, కనుమూరి ఈశ్వర్, పత్తిపాటి బాబురావు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.


## మండల డిపిఆర్టియు అధ్యక్ష కార్యదర్శి ఏకగ్రీవ ఎన్నిక





వత్సవాయి,సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ : మండలంలో మక్కపేట గ్రామంలో శనివారం డి పి ఆర్ టి యు సర్వసభ్య కార్యవర్గ సమావేశం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంనకు డి పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి. శ్రీను,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పి.నాగరాజు కంచికచర్ల మండల అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి పి ఆర్ టి యు వత్సవాయి మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.రాష్ట్ర అధ్యక్షులు వారు చేతులు మీదుగా వారికి నియామక పత్రాలు అందజేయడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎస్ కిరణ్ కుమార్ ఎస్ఏ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నె వీడు, మండల అధ్యక్షులుగా జక్కు రవీంద్రనాథ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భీమవరం, ప్రధాన కార్యదర్శిగా షేక్ జాన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మక్కపేట, కోశాధికారిగా అజ్మీర్ వెంకటప్పయ్య మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కన్నె వీడు ఉపాధ్యాయులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల ప్రక్రియకి పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి యంగ్రాతి మల్లేశ్వరరావు వ్యవహరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ టీచర్స్ కు రావాలసిన డిఏ బకాయిలు అలాగే మధ్యంతర భృతి త్వరగా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయ సమస్యలను తమ దృష్టికి, రాష్ట్ర స్థాయి దృష్టికి తీసుకొని వస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల జీవితాలలో కొత్త వెలుగులు



జగ్గయ్యపేట సెప్టెంబర్ 13 మేజర్ న్యూస్ : పట్టణానికి చెందిన కాకరపత్తి సోమేశ్వరరావు భార్య జ్యోతి పుట్టినరోజు సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు సమక్షంలో శనివారం లింగగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు శ్రీనివాసరరావు కి నడవడానికి స్టాండ్ అందించడం జరిగింది ఈ సందర్భంగా నియోజకవర్గం దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జ్యోతి పుట్టిన రోజు సందర్భంగా సోమేశ్వరరావుకి ఇలాంటి ఆలోచన రావడం చాలా గొప్ప విషయమని ఇంకా ఈ నియోజకవర్గం లో ఎన్నో అవసరాలు ఉన్న దివ్యాంగులు ఉన్నారు అని వారికి సహాయం అందించడానికి సమాజంలో ఉన్నత స్థితి లో ఉన్నవాళ్లు ముందుకు రావాలి అని విన్నవించారు మన చుట్టు పక్కల ఎన్నో సిమెంట్ ఇండస్ట్రీస్ ఉన్నాయి వారిలో కొంతమంది ముందుకువచ్చిన నియోజకవర్గం లో ఉన్న అందరి దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపవచ్చని అన్నారు ఈ స్టాండ్ బహుకరించినందుకు సోమేశ్వరరావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు అలాగే ఈ కార్యక్రమం లో ఎల్ఐసి అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండయ్య పాల్గొన్నారు.

# తురకపాలెం మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి





**గ్రామంలో అందుతున్న వైద్య సేవలు భేష్**

**అసహజ మరణాలకు కారణాలను అన్వేషించాలి**

**ఎయిమ్స్ వంటి అత్యున్నత వైద్య సంస్థల నిపుణులతో కమిటీ వేయాలి**

**వైసిపి హయాంలో మద్యం అలవాటు ఉన్న ప్రతి ఒక్కరూ హెల్త్ చెకప్ చేయించుకోవాలి**

**మృతుల కుటుంబాలకు రూ.10 వేలు లెక్కన ఆర్థిక సాయం**

**తురకపాలెంలో మృతుల కుటుంబాలను పరామర్శించి, గ్రామస్తులకు ధైర్యం చెప్పిన బిసివై అధినేత రామచంద్రయాదవ్**

అమరావతి, మేజర్ న్యూస్ : గుంటూరు జిల్లా తురకపాలెంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తురకపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు మూడు నెలలుగా తురకపాలెంలో అసహజ మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మరణించిన వారిలో ఎక్కువ మంది పురుషులే ఉన్నారని, అలాగే చనిపోయిన వారిలో 30 నుంచి 40 సం.ల మధ్య వయస్సులే ఎక్కువగా ఉండటం బాధ కలిగిస్తోందన్నారు. గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమ న్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 1340 మందికి వైద్య పరీక్షలు చేస్తే అందులో 1068 మందికి కిడ్నీ సమస్యలు, 168 మందికి లివర్ సమస్యలు ఉన్నట్టు పరీక్షల్లో తేలిందన్నారు. గ్రామంలో వందలో 70 మందికి ఈ ఆరోగ్య సమస్యలు రావ డానికి కారణం ఏంటో యుద్ధప్రాతిపదికన తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తురకపాలెంలో చనిపోయిన వారు సహజ మరణాలుగా కాకుండా వారి కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు చాలా బాగున్నాయని రామచంద్రయాదవ్ కితాబిచ్చారు.

**రాష్ట్రమంతా స్క్రీనింగ్ చేయించాలి**

తురకపాలెంలో సంభవించిన అసహజ మరణాల దృష్ట్యా రాష్ట్రంలో కూడా ఒకింత ఆందోళన నెలకొందన్నారు రామచంద్రయాదవ్. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ప్రభుత్వం ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించాలన్నారు. ఇలాంటి ఘటనలు కేవలం తురకపాలెంకే కాదు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా ఉందా? అనే అనుమానాన్ని కొందరు నిపుణులు వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎయిమ్స్ వంటి అత్యున్నత వైద్య విజ్ఞాన సంస్థ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి కారణాలను అన్వేషించాలని కోరారు.


**వైసిపి హయాంలో కల్తీ మద్యం వల్లేనా? అనే అనుమానం కలుగుతోంది**

తురకపాలెంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో బయటపడిన అనారోగ్య సమస్యలను చూస్తుంటే వైసిపి హయాంలో అమ్మిన కల్తీ మద్యం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తి ఉండవచ్చనే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారని రామచంద్రయాదవ్ తెలిపారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో మద్యం సేవించిన వారంతా ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. దీనిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**మృతుల కుటుంబాలకు రూ10 వేలు ఆర్థిక సాయం**

తురకపాలెంలో పర్యటించిన రామచంద్రయాదవ్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ. 10వేలు లెక్కన ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మధ్య వయస్కులు చనిపోవడంతో కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో ఆస్పత్రులలో జాయిన్ అవుతున్న యువకుల వివరాలను ప్రభుత్వం పర్యవేక్షించాలని కోరారు.

## కొనసాగుతున్న దివిసీమ గాంధీ శత జయంతి వేడుకలు



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ, తెలుగు జాతి రత్నం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక వంతెన సెంటరులోని స్వర్గీయ మండలి విగ్రహానికి కొత్తపేట రామకటిపురం గ్రామాలకు చెందిన కూటమి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్తపేట పిఏసిఎస్ చైర్మన్ యలవర్తి నాగ మునేశ్వర రావు (చిన్నా) మాట్లాడుతూ ఎంవీ కృష్ణారావు సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా నియోజకవర్గ ప్రగతికి, రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిది అన్నారు. దివిసీమ ఉప్పెనతో ఏర్పడిన దయనీయ పరిస్థితిని మార్చేందుకు, మృతదేహాల దహనం మొదలుకొని, బ్రతికి ఉన్న వారి ఆకలి తీర్చటం వరకూ కృష్ణారావు ఆకలి దప్పికలు మరిచి శ్రమించిన తీరు నేటికీ మరువలేనిదన్నారు. ఉప్పెనతో కొట్టుకుపోయిన గ్రామాల పునర్నిర్మాణంతో దివిసీమ పునరుజ్జీవానికి మండలి చేసిన కృషి ఆయనకు ప్రపంచ గుర్తింపునిచ్చిందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, రామకోటి పురం మాజీ సర్పంచ్ బొప్పన కాశీ విశ్వేశ్వరరావు బొప్పన వెంకట భరత్ దీవి శ్రీను రేపల్లె అంకినీడు,బొప్పన శేషారావు, డీ.శ్రీనివాసరావు, వై.కృష్ణారావు, కే.వేణుబాబు, జి.శ్రీనివాసరావు, బీహెచ్.శ్రీనివాసరావు నివాళులర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రాజనాల వీరబాబు, జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి పవన్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), అన్నపరెడ్డి రామదాసు, విశ్వనాథపల్లి పాప, షేక్ మొగల్ మురాద్ బేగ్, ముళ్ళపూడి శ్రీనివాసరావు, గరికపాటి శ్రీనివాసరావు, కమ్మిలి సాయి భార్గవ, మైలా హరిబాబు, శోభిల ఏడుకొండ లు, బీ.వీరేంద్ర కుమార్ (బాబూజీ), తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మమూరు పిఏసిఎస్ చైర్మన్‌గా శేషుకుమార్



తోట్లవల్లూరు మేజర్ న్యూస్ : తోట్లవల్లూరు మండల పరిధిలోని కుమ్మమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గా రామినేని వెంకట శేషుకుమార్ నియమితులయ్యారు. ప్రభుత్వం ఈ సంఘానికి త్రీ మెన్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ గా శేషుకుమార్ తో పాటు సభ్యులుగా చొప్పరపు వెంకటేశ్వరరావు, మురాల జానకి రామయ్య లను నియమించారు. సంఘ చైర్మన్ గా నియమితులైన శేషుకుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను ఈ పదవికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే కుమార్ రాజాకు, పదవి ఇచ్చేందుకు కృషి చేసిన మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి వీరంకి పరుశురాం, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అందించిన పదవికి న్యాయం చేస్తానని, రైతులకు పూర్తిగా సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# మేము సైతం.. సేవా సమయాన్ని పొదుపు చేస్తాం..




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** సమాజంలో భాగమైన మనం సామాజిక బాధ్యతతో ఒకరికి చేసే సేవ వెలకట్టలేనిదని.. దేశంలోనే మొదటిసారిగా ఎన్‌టీఆర్ జిల్లాలో టైమ్ బ్యాంక్ – మేము కూడా పేరుతో ఓ వినూత్న కార్యక్రమాన్ని పైలట్ ప్రాతిపదికన అమలుచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో టైమ్ బ్యాంక్ కార్యక్రమంపై యువ వాలంటీర్లకు వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యువ వాలంటీర్లు సమాజానికి ఏదో ఒక రూపంలో సేవ చేస్తే.. వారు ఎంత సమయం పాటు సేవ చేశారనే దాని ఆధారంగా ఆ సమయం టైమ్ బ్యాంక్‌లో కాయిన్ల రూపంలో జమవుతాయని.. వారు సంపాదించిన టైమ్ కాయిన్లను వాలంటీర్లు లేదా వారి కుటుంబ సభ్యులు అవసరమైనప్పుడు వినియోగించుకోవచ్చని వివరించారు. విశేష సేవలందించిన వాలంటీర్లకు డిజిటల్ సర్టిఫికేట్లు, మెరిట్ బ్యాడ్జీలు కూడా ప్రదానం చేయనున్నట్లు వివరించారు. టైమ్ బ్యాంకు కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా విజయవాడ రైల్వే స్టేషన్, పీఎన్ బస్‌స్టేషన్, ప్రధాన రైల్వే స్టేషన్లలో అమలుచేయనున్నట్లు తెలిపారు. నాలుగు వారాల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసిన తరువాత వాలంటీర్ల అభిప్రాయాలను సేకరించి, అనంతరం మొత్తం జిల్లా మొత్తానికి ఈ వినూత్న విధానాన్ని అమలుచేయనున్నట్లు తెలిపారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించేందుకు, బంగారు భవిష్యత్తుకు నిర్మాతలుగా తీర్చిదిద్దేందుకు ఈ విధానాన్ని అమలుచేయనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి.. ఈ వినూత్న విధానం విధివిధానాలు, డిజిటల్ మానిటరింగ్, డ్యాష్‌బోర్డు, ఈ–సర్టిఫికేట్ తదితరాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అగిరిపల్లి)కి చెందిన 45 మంది విద్యార్థులతో పాటు డా. నాగసుధారాణి, డా. శ్రీలత, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాల నిరంతర పర్యవేక్షణ







**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** న్యూ రాజరాజేశ్వరి పేటలో ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ అందిస్తున్నామని.. ప్రజలు కూడా అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. న్యూ జీజీహెచ్‌ను సందర్శించి డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. భయపడాల్సిన పనిలేదంటూ భరోసా కల్పించారు. అనంతరం ఆర్ఆర్‌పేటలో పర్యటించి ప్రజలకు స్వయంగా డయేరియాపై అవగాహన కల్పించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని.. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డయేరియా కేసుల ట్రాకింగ్‌తో పాటు సకాలంలో వైద్యం అందించే విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరిలోనైనా రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఫుడ్ అవుట్‌లెట్లను మూసివేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కరపత్రాల ద్వారా అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియాపై అవగాహన కల్పిస్తున్నారని.. ప్రజలు ఈ సూచనలను తు.చ. తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. అయితే జాగ్రత్తగా ఉండాలని.. ఏ సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరమని.. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సి ఉందన్నారు. ఈ వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసికట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ప్రతి దేవాలయంలో వివాహానికి అర్హత వయసు, వయసు ధ్రువీకరణపత్రాలు, చట్ట నియమ నిబంధనలు తెలియజేసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల్లో జరిగే వివాహాలపై ఈవోలు ప్రత్యేకంగా దృష్టిసారించి, పర్యవేక్షించాలని సూచించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబరుతో పాటు చైల్డ్ హెల్ప్ లైన్ 1098కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాల్లో ప్రదర్శించాల్సిన వివరాలతో కూడిన నమూనా పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి, ఎండోమెంట్ ఏసీ షణ్ముఖ నటరాజన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రజలకు సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం సేవలు అభినందనీయం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంత ప్రజలకు సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం అందిస్తున్న ఆరోగ్య సేవలు అభినందనీయమని శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పిఏసిఎస్ బండి పరాత్పర రావులు అన్నారు. ఘంటసాల గ్రామం లోని పెద్ద కల్యాణ మండపంలో కూచిపూడికి చెందిన రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం వారి ఆధ్వర్యంలో శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, పిఏసిఎస్ బండి పరాత్పరరావుల సహకారంతో కూచిపూడి రోటరీ క్లబ్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ ఏ.ఆర్.కే.శివ ప్రసాద్ (జనరల్ సర్జరీ విభాగం), డాక్టర్ లిల్లీపాల్ (గైనకాలజీ), డాక్టర్ శ్వేత (డెంటల్ వైద్య విభాగం), డ్రాక్టర్ పవన్ (ఆప్తమాలజీ)లు వైద్య సేవలు అందించారు. కూచిపూడి రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ హనుమ కుమార్, హాస్పిటల్ మేనేజర్ నిమ్మగడ్డ సత్య ప్రకాష్. పీఆర్వో తాతా తిరు గణేష్, షామియానా బాషా, వార్డు సభ్యులు సురేష్, కొండపల్లి వెంకట కృష్ణారావు, వేమూరి రమేష్, దోనేపూడి శ్రీనివాసరావు, జొన్నలగడ్డ వెంకటేష్, సోలే శ్రీను, పిఏసిఎస్ కార్యదర్శి కొణతం రామకృష్ణ, శ్రీను, గ్రామ పెద్దలు, రోటరీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## హాస్పటల్లో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 13, మేజర్ న్యూస్ :** నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యానికి గురై విజయవాడలోని వెంకటరమణ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శనివారం హాస్పిటల్‌ను సందర్శించి వారిని పరామర్శించారు. కాకాని నగర్ కి చెందిన రిటైర్డ్ ఎన్ ఎస్ పి ఉద్యోగి షేక్ అహ్మద్ మోకాళ్ల శస్త్రచికిత్స పొందుతుండగా ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి, వైద్యుల ద్వారా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చెరువుబజారు కు చెందిన ఓర్సు నాగరాజు ని కూడా ఎమ్మెల్యే పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన షేక్ మస్తాన్, షేక్ మీరాభి లను కూడా ఎమ్మెల్యే పరామర్శించి, ధైర్యం చెప్పి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గంద్రాయి గ్రామానికి చెందిన షేక్ సైదులు కూడా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయనను ఎమ్మెల్యే కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పోలంపల్లి పి ఏ సి ఎస్ చైర్మన్ మన్నె బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి

**నాగాయలంక సెప్టెంబర్ 13 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామ పరిధిలో ఈనెల 8వ తేదీ సాగునీటి పంట కాలువలలో గుర్తు తెలియని 45–50 సంలు, గల ఒక మగవ్యక్తి, మృతదేహంకొట్టుకొని రాగా రాబడిన సమాచారం మేరకు నాగాయలంక సబ్ ఇన్ స్పెక్టర్ కలిదిండి రాజేష్, నాగాయలంక పోలీస్ స్టేషన్ సిబ్బంది, అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ వివరాలు కోసం మృతదేహాన్ని గవర్నమెంట్ ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురి గదిలో ఉంచారు. మృతుని యొక్క వివరాలు తెలియపరచాల్సిందిగా మీడియా ద్వారా ప్రకటనలో తెలిపారు. మృతుని ఫోటోతో సహా సంబంధిత వివరాల కోసం ప్రజలకు, ఆచూకీ తెలిసినవారు, వివరాలు తెలియపరచమని వివరాలు కోరారు. శనివారం వరకు సంబంధిత వ్యక్తి యొక్క వివరాలు ఎవరు తెలియపరచలేక పోవుటం చేత, సంబంధిత మృతుని యొక్క, మృతదేహాన్ని గ్రామంలో రెవిన్యూ శాఖ వీఆర్వో ఆధ్వర్యంలో శవ పంచనామా, చేసి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కలిదిండి రాజేష్ వారి సొంత ఖర్చులతో కననం చేయించారు.

## అతిసారా నివారణకు అవగాహన కల్పించండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అతిసారా నివారణకు విస్తృతంగా అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం శాఖాధిపతులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా ఆదేశాల మేరకు నగరంలో ఉన్న ప్రజలందరికీ అతిసారా నివారణ పై అవగాహన కల్పించాలని, ఇంటింటికి వెళ్లి కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు, నీరసం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని, దగ్గరలోని ప్రథమ చికిత్స కేంద్రంలో సంప్రదించాలని వివరించాలన్నారు. అతిసారా నివారణకు శుభ్రమైన కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, నీరు నిల్వ లేకుండా ఉంచాలని, వాడుకునే మంచినీటికి మూతలు తప్పనిసరిగా పెట్టాలని, ఇంటి పైనున్న ట్యాంకును క్రమ తప్పకుండా ప్రతి 15 రోజులకు పరిశుభ్రపరుస్తూ ఉండాలని, ట్యాంకు పైన తప్పనిసరిగా మూతను వాడాలని, ఆహారం తినే ముందు మరుగుదొడ్డికి వెళ్ళిన తర్వాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో కడుకోవాలని, ఓఆర్ఎస్ ద్రావణం ఇంట్లో ఉంచుకోవాలని, విరేచనాలు మొదలయితే వెంటనే ఓఆర్ఎస్ తాగాలని, పసి పిల్లలు ఉంటే వారికి తల్లిపాలను కొనసాగించవచ్చని, ఇంటి లోపల ఉన్న వ్యర్థాలను తొలగించి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే కలుషిత నీరు బయట వండిన అశుభ్ర ఆహారం తినకూడదని, విరేచనాలు వచ్చినప్పుడు కాఫీ, టీ, పానీయాలు తాగకూడదని, మలమూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాలలో చేయకూడదని, చిన్నారులకు ఓఆర్ఎస్ ద్రవాలు ఇవ్వకుండా వదిలేయకూడదని, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎటువంటి సందేహాలు ఉన్నా సమాచారం లేదా సహాయం కోసం ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూమ్ 9154970454 నంబర్ను సంప్రదించాలని అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి, అతిసారా నివారణ పై అవగాహన కల్పించే కరపత్రాలు అందించి, మైకు ద్వారా అనౌన్స్మెంట్లు చేసి, వారికి ఆరోగ్య సర్వే నిర్వహించారు. మరోవైపు ప్రతి ఇంటికి త్రాగునీరు బబుల్స్ సరఫరా చేశారు.

# రవీంద్రభారతి స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

## పిల్లలతో పాటు ఉత్సాహంగా పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్








**కృష్ణలంక మేజర్ న్యూస్ :** బాలాజీ నగర్ రవీంద్రభారతి స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీంద్రభారతి స్కూల్ ఛైర్మన్ వీరమాచినేని వంశీ కృష్ణ, ఎకడమిక్ డైరక్టర్ శాంతి హజరయ్యారు.. ప్రస్తుత రోజుల్లో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య వాళ్ళ విలువల గురించి, వాళ్ళ అనుభవాల గురించి చెప్పారు. ప్రిన్సిపాల్ జ్యోతి, వారి సిబ్బంది కూడా ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో పిల్లలు సెల్ ఫోన్లకు అలవాటు పడుతున్నారు, అలాకాకుండా పిల్లలు గ్రాండ్ పేరెంట్స్‌తో గడపాలని, వారి ప్రేమలను పొందాలని చెప్పారు.

ఈ కార్యక్రమానికి వచ్చిన గ్రాండ్ పేరట్స్ మనవడు, మనవ రాళ్ళతో వాళ్ళకు ఉన్న అనుభవాలను పంచుకొని, వాళ్ళకోసం జరిగిన ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ " గ్రాండ్ పేరట్స్ డే' కార్యక్రమానికి సహకరించి, కార్యక్రమం జయప్రదం చేసినందుకు గ్రాండ్ పేరెంట్స్ అందరికి ప్రిన్సిపల్ జ్యోతి అభినందనలు తెలిపారు.

# శ్రీచైతన్య పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలు







**కృష్ణలంక మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీచైతన్య కృష్ణలంక శాఖలో 77వ హిందీ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించి, హిందీ భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియ జేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడకూ భిన్నత్వంలో ఏకత్వం సాధించిన ఏకైక దేశం మన భారతదేశం. అనేక భాషలు కలిగిన దేశం అన్నారు. హిందీ భాషను ప్రోత్సహించడం ద్వారా వివిధ ప్రాంతాల ప్రజల మధ్య భాషా ఏకతను పెంచడానికి సహాయప డుతుందన్నారు. భారత జాతీయోద్య మంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏక తాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడిందని, గాంధీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్ లో హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా ప్రభుత్వం ప్రకటించింది. బీహార్ రాజేంద్రసింహ, హజారీ ప్రసాద్ ద్వివేది, మైథిలి శరణ్ గుప్తా మొదలైన వారి కృషి ఫలితంగా భారత గణతంత్ర అధికారిక భాషలో హిందీ ఒకటిగా ఎంచుకుంది. రాజేంద్ర సింహ తన 50వ పుట్టిన రోజును హిందీ దివస్‌గా జరుపుకున్నారు. భారత దేశంలో అత్యధి కంగా 78% మంది హిందీ మాట్లాడగల డగలరు అని ఉద్ఘాటించారు. విద్యార్థులు పలు వేషధారణలు ధరించి, నృత్యాలు, నాటకాలు, ప్రదర్శించి, వారిలో భాష పట్ల అభిమానాన్ని, గౌరవాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఈజియం యం.మురళి కృష్ణ, ఆర్.బి. జె.రాజేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ సురేష్, ఇన్చార్డులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు హింది భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు..

# క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** క్రీడలు యువతలో శక్తి, ఉత్సాహం నింపే సాధనమని భావించి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేత్రుత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. శనివారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాణిగారితోట టైటాన్స్ టీమ్ క్రికెట్ క్రీడాకారులకు గద్దె క్రాంతి కుమార్ రూ.10 వేలు విలువ చేసే క్రికెట్ కిట్ ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్బంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుత క్రీడలను అన్ని స్థాయిలలో ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందడుగు వేస్తున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ విజయవంతం కావడం ఇందుకు ఉదాహరణ అన్నారు. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రవ్యాప్తంగా యువ కులు ముందుకు వచ్చి ప్రతిభను కనబరిచారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం సమగ్ర క్రీడా విధానాన్ని అమలు చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయవాడలో జరగనున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను కూడా ఘనంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వేదిక కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేని వారు గల్లీల్లోనే ఆగిపోతున్నా రని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, యువత ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా మైదానాలు, స్టేడియంలు ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. క్రీడల ద్వారా రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు రావడంతో పాటు క్రీడాకారులకు ఉద్యోగాలు కూడా త్వరితగతిన లభిస్తాయన్నారు. యువతలో ఆరోగ్యకరమైన శరీర దారుఢ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దండగల గణేష్, పొట్లూరి ప్రసాద్, రవీంద్ర, సోము, భార్గవ్, కె.పవన్, ధీరజ్, పందిటి వంశీ, దుర్గారావు, నాగబాబు, సాయిరాం, చక్రి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లా ఎస్పీగా వాసన విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విద్యాసాగర్ నాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసాగర్ నాయుడు ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేస్తున్నారు.

## 36వ డివిజన్ ప్రజా కాపునాడు కమిటీ ఏర్పాటు



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో 64 డివిజన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శనివారం 36వ డివిజన్ ప్రజా కాపునాడు కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. 36వ డివి జన్ ప్రజా కాపునాడు అధ్యక్షులు పులపాకిషోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకన్న, ఉపాధ్యక్షులు దాసరి రాఘవ నియమించడం జరి గింది. యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండాలి కాపుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేయాలని, పేద కాపు మహిళలకు పెళ్ళికానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని సూచించారు..

## నూర్ భాషా/దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా మైలమూరి పీరుబాబు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ నూర్ భాషా/దూదేకుల కార్పొరే షన్ డైరెక్టర్‌గా మైలమూరి పీరుబాబుని నియమించినందుకు విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌ని, విజయవాడ పా ర్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని)ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్య వాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నూర్ భాషా/ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ మైలుమూరి పీరుబాబు, 18వ డివిజన్ నా యకులు సిద్ధం నాగేందర్ రెడ్డి, పెద్ది అన్నారావు, పగడాల వెంకటేశ్వర రెడ్డి, బలగాని శ్రీనువాసరావు, దేవులాశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999